ఆవేశంగా.

మా ఆఫీసర్‌గారు వచ్చేసరికి నేను డాక్టరు గారి భవనంలో ముందు హాల్లో డబ్బులు వసూలు చేస్తున్న మనిషి దగ్గిర నిలబడి ఉన్నాను. "కదలకు. అదుగో మా ఆఫీసర్ గారు వచ్చేరు. ఇదంతా చెకింగు చేస్తారు" అన్నాను.

"నమస్కారం సార్. దయచెయ్యండి" అన్నాడు నేను పట్టుకోబోయిన మనిషి లేచి నిలబడి. "ఒక్క నిమిషం. డాక్టరుగార్ని తీసుకొస్తాను" అని మెరుపు వేగంతో టేబిలు సొరుగుకి తాళం బిగించి వెళ్లేడు.

"ఏంటీ, నువ్విక్కడున్నావు?" అన్నారు మా ఆఫీసరు గారు.

"పన్ను కట్టవలసిన వారు ఎక్కడుంటే మనం అక్కడుండాలి కదండి, సార్" అన్నాను.

"మతుండే మాట్లాడుతున్నావా; నువ్వు టెలిఫోన్ చేసినప్పుడే అనుకున్నాను. నీకేదో అయిందని! స్టుపిడ్!"

డాక్టరుగారు లోపల్నించి వచ్చేరు. నవ్వుతూ మా ఆఫీసర్ గార్ని సమీపించి "ఏంటిసార్, ఫోనైనా చెయ్యకుండా వచ్చేసేరు?" అని షేక్హాండ్ ఇచ్చేరు. "రండి లోపలికి. ఇవాళ ఎక్కువ మంది పేషెంట్సు లేరు."

"అబ్బే; ఊరికే ఈ దారంట పాస్ అవుతూ వచ్చాను. నేను రేపు ఊళ్లో ఉండను. విష్యూ హేపీ న్యూఫియర్ చెబుదామని!" అని మా ఆఫీసర్ గారు; డాక్టరు గారందించిన చేతిని వదల కుండా మరీ మరీ నొక్కుతూ అన్నారు. ఆ తరవాత "మా కొత్త ఇన్‌స్పెక్టరు" అని నన్ను పరిచయం చేసేరు.

కాసేపట్లో డాక్టరుగారూ, కాంపౌండరు గారూ (బిల్లు కలెక్టర్‌గారూ) అందరూ మా కిద్దరికీ విష్యూ హేపీ న్యూ ఇయర్ చెప్పేరు.

"నువ్వింకా చాలా నేర్చుకోవాలి, రామలింగం! మనకి రాతమూలకంగా వచ్చే స్టేట్‌మెంట్లు ముఖ్యం. అంతేగాని చెప్పుడు మాటల్ని బట్టి మనం పనిచెయ్యం" అని నాకు శీతోపదేశం చేసేరు మా ఆఫీసరు గారు. ★

# 51. బోణీ

**ము**ప్పయి ఏళ్ల కిందట ఒకనాడు;

సాయంకాలం నేను ఇంటికి వచ్చేసరికి మా ఆవిడ "ఏంటలా ఉన్నారు?" అని పలక రించింది.

"ఎలా ఉన్నాను?"

"ఎలా వుండడమేమిటి; మొగుడుకొట్టేడా మొహం తీరే అంతా - అన్నట్టున్నారు - అదే చాలా డీలా పడిపోయి ఉన్నారు."

"పొద్దుట లేవగానే ఎవడిమొహం చూసేనోగాని ఇవాళ ఒక్కపనీ అవలేదు. వెళ్లినచోటల్లా

చుక్కెదురే అయింది."

"ఎవరి మొహమో కాదు. మీ మొహమే చూసుకున్నారు. పక్కమీంచి లేస్తూనే - ఈ అద్దం ఇక్కడెందుకుందీ - అని కేక పెట్టేరు; జ్ఞాపకం తెచ్చుకోండి" అని మా ఆవిడ తిప్పికొట్టింది.

మధ్యతరగతి మనుషులకి ఒకే ఒక ఆనందం - తమని చూసి తామే నవ్వుకోగలగడం; ఎవరిమీదో జోకు వేసినప్పటికంటే తమ మీద జోకు వేసుకున్నప్పుడు ఎక్కువగా ఆనందించగలిగే నిరాటంకమైన అవకాశం. "టు లవ్ వన్‌సెల్ఫ్ ఈజ్ టు బి ఇన్ లైఫ్ లాంగ్ రొమాన్స్ -" అని ఎవరో చెప్పిన సూక్తి.

ఆ రోజు రెండు "బోణీ దెబ్బలు" తిన్నానన్న సంగతి అప్పుడు గుర్తొచ్చింది. క్రితంరోజు రాత్రి ఇంటికి రాగానే "కాఫీ పొడి అయిపోయింది. లేవగానే కాఫీ ఇవ్వకపోతే విసుక్కుంటారు. కిరాణా కొట్టు కట్టేకముందే వెళ్లి కాఫీ పొడి తెచ్చేండి" అంది మా ఆవిడ. "పొద్దుట లేవగానే వెళ్లి తెస్తాన్లెద్దూ" అని బద్ధకించేసేను. ఉదయం లేవగానే సందుచివర కిరాణా కొట్టుకెళ్లి "పావుపాను కాఫీ పొడి" అని స్టయిల్‌గా చెయ్యి జాపేసరికి షావుకారు అబ్బాయి "ఇంకా బోణీలేదు పంతులుగారూ, ఇవాళకి అరువు పెట్టకండి" అని చొక్కాజేబులోంచి తొంగిచూస్తున్న పది రూపాయల నోటువేపు వేలుపెట్టి చూపించేడు. దాంతో, నోటిమాటతో పోయేపని నోటు పాటు దాకా అయిందికాదు.

బోణీ అనేది తెల్లవారి లేచే సమయం లోనే కాదు, ఉదయం పదకొండు గంటల వేళప్పుడు, మధ్యాహ్నం రెండు గంటల వేళప్పుడు, ఆ మాటకొస్తే సాయంకాలం ఏడు గంటలప్పుడు కూడా దెబ్బకొట్టొచ్చునని ఆ రోజు తెలిసింది.

పదిన్నరకల్లా భోజనం పూర్తిచేసుకుని ఆఫీసుకి బయలుదేరుతూ రిక్షాబేరం ఆడుకున్నాను. "కలెక్టరాఫీసుకి ఎంత" అంటే "రెండు రూపాయిలిప్పించండి బాబూ" అన్నాడు. రూపాయిన్నరకి బేరం సెటిలైంది. ఆఫీసు దగ్గర రిక్షా దిగుతూ రెండు రూపాయల నోటు అందిస్తే రిక్షా అబ్బాయి ఆ నోటుని ముద్దుపెట్టుకుని జేబులో పెట్టేసుకున్నాడు. "అదేమిటి, అర్ధ రూపాయి ఇవ్వవా ఏమిటి?" అన్నాను. "తమరిదే బోణీ బేరం బాబూ! చిల్లర లేదు. ఇవాల్టికి ఒదిలెయ్యండి. దండాలు బాబూ." అని క్షణంలో ఎక్స్‌ప్లాయిట్ చేసి ఎక్స్‌ప్రెస్‌లా వెళ్లిపోయాడు.

ఓసారి మధ్యాహ్నం రెండు గంటల వేళప్పుడూ అలాగే అయింది. "మరీ నాలుగు ఫర్లాంగుల దూరానికి రెండు రూపాయలేమిటి? పోనీ నాతో సంసారం సామానూ ఏమీ లేవు కదా. రూపాయిన్నర చేసుకో" అంటేనూ, "బోణీ బేరం బాబూ, ఇప్పుడే బండి తీసేను. అద్దురూపాయి డబ్బులికి సూసుకుంటారేటి, ఎక్కండి బాబూ, ఎలిపోదాం! తమరు సిగరెట్టు కాల్చినంత లేదు" అని ప్రలోభపెట్టేశాడు ఆ రిక్షా అబ్బాయి. "నాకు సిగరెట్లు కాల్చే అలవాటు లేదురా బాబూ" అంటే కూడా వినిపించుకున్నాడు కాదు.

వైజాగ్‌లో నాకు శర్మ అని ఒక ఫ్రెండున్నాడు. వాళ్లిల్లు కలెక్టరాఫీసు అవతల క్రిష్ణ నగర్‌లో. జగదాంబ సినిమాహాలులో ఫస్టుషో చూసి ఇంటికెళ్లడానికి రిక్షా ఎక్కి ఆ "అప్పు" అంతా తొక్కించుకుని ఇంటికెళ్లేక రూపాయి చేతులో పెట్టేవాడు. వైజాగులో సొంత ఇల్లు; పాలెంలో

పదెకరాల భూమి, మందుల కంపెనీలో నెలకి రెండువేలు జీతం ఉన్న మా శర్మ రిక్షావాళ్లనీ, కూరగాయలమ్ముకునే వాళ్లనీ, బూట్‌పాలిష్ కుర్రాళ్లనీ, కేరేజీలు మోసేవాళ్లని మనం ఎలా ఎలా ఎక్స్‌ప్లాయిట్ చేస్తామో అదంతా మిత్రబృందం సరదాగా కాలక్షేపం చేస్తున్నప్పుడు హృదయవిదారకంగా వర్ణించి చెప్తూ ఆనందానికి ఆనకట్టలు కట్టేస్తూ ఉంటాడు.

ఉగాది పండుగనాడు (ఫస్టుకాఫీ మినహాయిస్తే) ఉగాదిపచ్చడి తినకుండా ఇంకేమీ నోట పెట్టనివ్వరు మన లేడీసు. ఇవాళంతా వేళపట్టున అన్నిపన్లూ చేసుకోవాలి. "శుభ్రంగా హాయిగా ఉండాలి. అలా అయితేనే సంవత్సరం అంతా కులాసాగా ఉంటాం" అని పిల్లలకీ పెద్దవాళ్లకీ నచ్చజెప్తూ వాళ్లు పిండి వంటలు వండుకోడానికి టైమ్ గెయిన్ చెయ్యడానికి ట్రై చేస్తారు. "మరి ఇవాళ ఈ ఉగాది పచ్చడి ఎందుకు పెడతారు. పరగడుపునే?" అని ఏ పధ్నాలుగేళ్ల పిల్లాడో ఎదురు తిరగబోతే "బతుకులో చేదు పులుపూ వగరూ అన్నీ కూడా తీపితో సహా పక్కపక్కనే ఉంటాయని చెప్పడానికి సుమా" అని సముదాయించేస్తారు. ఇది కూడా "బోణి" బేరమే.

మొన్న డిసెంబరు 31 నాడు బెజవాడ నించి నాకేదో పుస్తకాల పార్సెలు లారీలో వచ్చిందని తెలియజేస్తూ లారీ రసీదు ఒస్తేనూ, జనవరి ఫస్టునాడు ఆ లారీ ఆఫీసుకు వెళ్లేను. నేను వెళ్లేసరికి ఉదయం తొమ్మిది దాటి ఐదు నిమిషాలైంది. అప్పటికే ఒకాయన (తన పార్సెల్ కోసం) అక్కడ నించున్నాడు. లారీ ఆఫీసు వాళ్లు షట్టర్సు ఎత్తి షాప్రవేశం చేయగానే తన జేబులోంచి లారీ రసీదు తీసి చూపించేడు. అతని పార్సెల్సు బైటపెట్టిస్తూ లారీ ఆఫీసు గుమస్తా "అరవై రూపాయలు" అన్నాడు. ఈ పెద్ద మనిషి నూరు రూపాయల నోటు ఫెళఫెళ లాడించగానే "బోణీ బేరం మీదేనండి, చిల్లరలేదు" అని "అరె, పార్సెల్సు లోనబెట్రా!" అన్నాడు.

నేను నా పార్సెల్ కోసం ముందుకి వెళ్తుండగా ఒకడు నాకన్నా ముందే ఆ కౌంటరు దగ్గరికి చేరేడు. "ఉండవయ్యా; నీకన్నా ముందొచ్చేను కదా!" అన్నాను. "రిక్షా పడద్దేమోని అడగటాకొచ్చేన్ సార్" అన్నాడు. మా ఇల్లు ఎక్కడుందో చెప్పి "ఎంత?" అన్నాను.

"ముందు పార్సెలు చూడనీండి" అన్నాడు.

"పది రూపాయలివ్వండి" అన్నాడు; పార్సెల్ చూసేక.

"ముందు నీ రిక్షా ఎలా ఉంటుందో చూడనీ." అనే అలవాటు లేక, ఎనిమిది రూపాయలకి బేరం కుదుర్చుకున్నాను, లారీ ఆఫీసు పక్కనున్న సందులోంచి ఆ అబ్బాయి రిక్షా తెచ్చి షాపు ఎదురుగా పెట్టేసరికి నాకు సంగతి అర్ధమైంది. అది సామాను పట్టుకెళ్లే రకం రిక్షా.

"దీంట్లో నేనెలా కూర్చోవాలి?" అని బేరం కాన్సిల్ చేసే ప్రయత్నంలో పడ్డాను. ఈ లోపుగా పక్కనించి ఒక ఖాళీ ఆటో వస్తే ఆపి షాపు కళాసీ చేత నా పార్సెలు ఆటోలో వేయించేను.

రిక్షా అబ్బాయి ఆటోకి అడ్డంగా నుంచుని పెద్దపెద్ద కేకలు ప్రారంభించేడు. "బేరం సెటిలైపోయాక నా బండి ఎక్కకుండా ఆటోలో ఎలాగెల్తారు? నేను పది రూపాయలడిగేను. నువ్వు ఎనిమిది ఇస్తానన్నావు. పోనీ అదేపోయింది కదాని రెండ్రూపాయలు కన్సిసనిచ్చేను. ఇప్పుడు ఆటో సూడగానే రిచ్చాకన్నా బేగెలిపోవచ్చు గదాని అందలెక్కేస్తున్నావు. అలా కుదర్దు" అని కాలుస్తున్న బీడి పారేసి ఆవేశపడ్డాడు.

"నీ రిక్షాలో పార్సెలు పెడితే నేను కూచోడానికి సదుపాయం లేదు. పోనీ పార్సెలు ఒకటే పెట్టి నేను నడిచి వస్తే నువ్వు దారి తెలియక ఆ పార్సెలు ఎటో పట్టుకుపోవచ్చు. అప్పుడు నీ అడ్రస్ కోసం నేను పోలీసుల చుట్టూ తిరగాలి" అని నేనన్నాను.

"ఇయాల జనవరి ఫస్టు. ఇదే బోణీ బేరం. ఇదిగాని ఒగ్గేస్తే ఈ ఏడాదంతా నాకు బేరమే రాదు" అన్నాడు రిక్షా అబ్బాయి.

ఉగాది లక్షణాలు జనవరి ఫస్టుకి కూడా వస్తున్నాయని, ఇంకా తీవ్రతరంగా ఒచ్చేస్తున్నాయని, ఈ అర్థంలేని సంప్రదాయాలకి వ్యతిరేకంగా ఏదైనా చెయ్యాలని, కనీసం ఏదైనా అనాలని నాకు కూడా ఆవేశం వచ్చింది. "నయమే! నీ బోణీకోసం నేనీవేళ ఈ సామాను బండి ఎక్కితే ఇంక ఏడాదంతా నాకు ఎక్స్‌ప్రెస్సుల్లోనూ పాసింజర్ రైళ్లలోనూ బస్సుల్లోనూ ప్రయాణం చేసే అదృష్టం ఉండదు. గూడ్స్ ట్రెయిన్లూ, లారీలే గతి! నా సంగతి కూడా ఆలోచించు మరి!" అని ఆటో ఎక్కి కూర్చుంటూ "పాపం, నాకోసం కాలుస్తూ కాలుస్తూ ఉన్న బోణీ బీడీ పారేసేవు. ఓ కట్టకొనుక్కో." అన్నాను. (రిక్షా జర్నీ కేన్సిలేషన్ ఫీజు అర్థరూపాయి చాలదంటారా?)

★

# 52. సహదేవ వైద్యం

**సు**మారు పాతికేళ్ల కిందట నేను విజయనగరం సర్వే పార్టీ ఆఫీసులో టెక్నికల్ సెక్షన్ల అజమాయిషీలో (అసిస్టెంట్ మేనేజర్‌గా) ఉండేవాణ్ణి. లంకవీధిలో మేం ఉన్న ఇంటికి పెరటివేపు వీధిలో సరిగ్గా మా ఇంటి పెరటి గేటుకి ఎదురుగుండా వుండే ఇంట్లో సంగీతం కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారం భావనారాయణ రావుగారు ఉండేవారు. సాహిత్యంలోనూ సంగీతం లోనూ నాకున్న లోతైన అభిరుచిని ప్రశంసిస్తూ ఆయన నన్ను సంగీతం నేర్చుకోమనీ, తెలుగు ఎం.ఏ. పరీక్షకి కట్టమని ప్రోత్సాహించేరు. సంగీతం నేర్చుకోడానికి మేడేపల్లి నరిసింగరావుగారి దగ్గరా, తెలుగెమ్మే గైడెన్స్‌కోసం పమిడిపాటి వెంకటరమణయ్యగారి దగ్గరా చేరేను. రమణయ్య మేష్టారు బహువ్యాపక ధారి. ఒక టైముకి దొరకడం, ఒక పద్ధతి ప్రకారం పాఠం చెప్పడం (కాలేజీలో ఎలా చేసేవారో గాని) రూములో మాత్రం సాగేది కాదు. అయితే దొరికేరంటే మాత్రం ఆయన చూపించే శ్రద్ధా ఏకాగ్రతా అనన్య సాధ్యం. మా హైస్కూలు రోజుల్లో మోడేకుర్తి కామేశ్వరరావుగారు హిస్టరీ; గజవల్లి చిదంబర రావుగారు కెమిస్ట్రీ; మెత్త మెత్తగా ముద్దు ముద్దుగా చెప్పేవారు; అరటిపండు వొలిచి ఇచ్చినంత సుళువుగా మింగుడైపోయేది. కాని ఈ రమణయ్య మేష్టారు కసిరి కొట్టినంత పనిచేసి చెప్పి ఇలా కూడా పాఠం బోధపరచువచ్చునని రుజువు చేసేరు. చిన్నయసూరి బాల వ్యాకరణం, భండార్కరు సంస్కృత వ్యాకరణం రమణయ్య మేష్టారు చెప్పకపోతే ఈ ఎమ్మేకొక దండంరా బాబూ అని ఎగ్జెంప్షన్ ఫీజు సంగతి మరచిపోయి ఎప్పట్లా కథలూ కాకరకాయలూ చదువుకునేవాణ్ణే. ఇద్దరం కలిసి నాటకం చూడ్డానికి హస్తబల్ హాల్లో ఆడియన్స్‌లో కూర్చున్నా, విశాఖపట్నం వెళ్లాలని బస్సెక్కినా అచ్చు పుస్తకం అవసరం లేకుండా తెలుగు వాఙ్మయ చరిత్రా రఘువంశం చెప్పగల దిట్ట; ఆయన. ద్వారం దుర్గాప్రసాదరావుగారు, శాయికృష్ణ అనే కే-ఎస్సెన్-పట్నాయక్ గారూ (అప్పుడప్పుడు ఏ యశ్వీ రమణారావుగారూ) పేకాటలో కూర్చోబెట్టినా